ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల

జిల్లా వార్తలు

5

శనివారం 3 ఫిబ్రవరి 2024

ముంపు బెడద తప్పేనా..?



కోటపల్లి మండలం రాంపూర్ వద్ద నీట మునిగిన పత్తి (ఫైల్)

- ప్రాజెక్టుల బ్యాక్ వాటర్‌తో మునుగుతున్న పొలాలు
- ఏటా వేల ఎకరాల్లో పంటకు తీరని నష్టం
- మూడేళ్లుగా నష్టపోతున్న అన్నదాతలు
- శాశ్వత పరిష్కారం కోసం ఎదురుచూపులు
- ఎన్డీఆర్టీ సర్వేతో చిగురిస్తున్న ఆశలు

మంచిర్యాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయం వల్ల రైతులకు ఎనలేని నష్టం వాటిల్లుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు సముదాయంలో భాగంగా గోదావరి నదిపై నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల బ్యాక్ వాటర్ కారణంగా జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం కలుగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన నాటి నుంచి ఇదే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ప్రాజెక్టు నిర్మించినందుకు సంతోషించాలో, బాధపడాలో తెలియని పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. నీళ్లుంటే పొలాలు పండి, తమ కష్టాలు తీరుతాయని భావించిన రైతులకు ప్రాజెక్టుల విధ్వంసం వల్ల చివరకు కన్నీరే మిగులుతోంది.

ముఖ్యంగా వర్షాకాలంలో గోదావరి ఉప్పొంగి నీరంతా సమీపంలోని పంట పొలాలకు చేరుతుండటంతో చేతికొచ్చిన పంట నీళ్లపాలవుతోంది. సుమారు నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి పునరావృతం అవుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోవడం లేదనే ఆరోపణలున్నాయి. పొలాల్లోకి నీరు చేరి పంట మునిగిపోవడంతో అధికారులు వచ్చి నష్టం అంచనా వేసి, హడావుడి చేయడమే తప్ప... రైతులకు ఒరగబెట్టిన మేలేదీ లేదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

పరిహారానికి నోచుకోని రైతులు..

ప్రాజెక్టుల బ్యాక్ వాటర్ నదికి రెండు వైపులా రెండు మూడు కిలోమీ టర్ల పరిధిలో ప్రవహిస్తూ పంటలను ముంచుతోంది. ప్రతి ఏటా రెండు, మూడు సార్లు చేతికి వచ్చిన పంటలు నీట మునుగుతుండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. మంచిర్యాల జిల్లాకు సంబంధించినంత వరకు గోదావరి పరివాహక ప్రాంతాలైన జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్, జైపూర్, చెన్నూరు, కోటపల్లి మండలాల్లోని నది ఒడ్డున ఉండే పంటలు తరుచుగా నీట మునుగుతుండగా, ప్రాణహిత పరివాహక ప్రాంతమైన వేమనపల్లి, కోటపల్లి మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంటుంది. బ్యాక్ వాటర్ కారణంగా వేల ఎకరాల్లో పత్తి, వరి, మిర్చితోపాటు ఇతర పంటలు నీళ్లపాలవుతున్నాయి.

ఇలా పంట నీట మునిగి నప్పుడల్లా అధికారులు సర్వే జరిపి, పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నారు. 2019 నుంచి ఇదే తంతు జరుగుతుండగా ప్రభుత్వ పరంగా రైతులను ఆదుకున్న దాఖలాలు లేవు. గతేడాది కూడా అధిక వర్షాల కారణంగా బ్యాక్ వాటర్‌తో పంటలు నీట మునిగాయి. ఆ సమయంలో జిల్లా పర్యటనకు వచ్చిన అప్పటి రాష్ట్ర అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చెన్నూరులో సమీక్ష ఏర్పాటు చేసి నీట మునుగుతున్న పంటలపై అధికారులు, రైతుల అభిప్రాయాలు తీసుకున్నారు. అయితే మూడేళ్ల గడుస్తున్నా ఇప్పటి వరకు నష్ట పరిహారం చెల్లించడం గానీ, శాశ్వత పరిష్కారం చూపడంగానీ చేయలేదు.



కోటపల్లి మండలంలో సర్వే చేస్తున్న ఎన్డీఆర్టీ బృందం (ఫైల్)

కేంద్రం ఆదేశాల మేరకు..

ప్రాజెక్టుల కారణంగా ఏటా ప్రధానంగా కోటపల్లి, చెన్నూరు, వేమనపల్లి మండలాల్లో చేతికొచ్చిన పంట నీట మునుగుతుండడంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు రోజుల క్రితం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ టీం (ఎన్డీఆర్టీ) సభ్యులు ముంపు ప్రాంతాల్లో సర్వేలు నిర్వహించారు. వరద ముంపు కారణంగా ఎంత మేర పంట పొలాలు, ప్రజల ఆస్తులకు నష్టం వాటిల్లుతుందోననే అంశంపై కోటపల్లి మండలం అర్జునగుట్ట, లక్ష్మీపూర్, ఎర్రాయిపేట, బోరపల్లి గ్రామాల్లో సర్వే చేపట్టారు. ముంపు నష్టంపై ఓ అంచనాకు వచ్చిన ఎన్డీఆర్టీ బృంద సభ్యులు సంబంధిత నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నారు. ఎన్డీఆర్టీ బృందం చేసిన సర్వే రిపోర్టు ఆధారంగా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టే అవకాశం ఉండడంతో ముంపు బాధితుల్లో నాలుగేళ్ల తరువాత ఆశలు చిగురిస్తున్నాయి. ముంపు ప్రాంతాల్లో సర్వే చేపట్టిన కేంద్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా ఓ నిర్ణయానికి రావడం ద్వారా శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

జిల్లాలో పంట నష్టం ఇలా..

కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయం పూర్తయిన నాటి నుంచి జిల్లాలో పెద్ద మొత్తంలో పంట నష్టం వాటిల్లింది. అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టుల బ్యాక్ వాటర్ కారణంగా కోటపల్లి మండలంలో 2019లో 1484 మంది రైతులకు సంబంధించిన సమారు 1670 ఎకరాలు పూర్తిగా నీట మునగగా, రైతులకు కోలుకోని విధంగా నష్టం వాటిల్లింది. అలాగే 2020లో 1644 మంది రైతులకు చెందిన 4580 ఎకరాల్లో పంట తుడిచిపెట్టుకుపోయింది.

2021లో 601 మందికి చెందిన 1063 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. చెన్నూరు మండలంలో 2019లో 839 మంది రైతులకు చెందిన 1183 ఎకరాలు, 2020లో 81 మందికి చెందిన సుమారు 100 ఎకరాలు, 20201లో 1081 మందికి చెందిన 2100 ఎకరాల్లో పంట నీళ్లపాలయింది.

అలాగే సుందిళ్ల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా 2021లో జైపూర్ మండలానికి చెందిన 258 మంది రైతులకు చెందిన సుమారు 500 ఎకరాల్లో పంట నీటమునిగింది. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాల కారణంగానూ నదులు ఉప్పొంగడంతో ప్రాజెక్టుల బ్యాక్ వాటర్ చేలు, పొలాలను పూర్తిగా ముంచెత్తింది. ఈ ఏడాది జూలై నెలలో కూడా భారీ వర్షాల కారణంగా వరదలు సంభవించి పంట పొలాలు నీట మునిగాయి. పంట నష్టం అంచనా వేసిన వ్యవసాయశాఖ అధికారులు సం బంధిత నివేదికను ఐదు నెలల క్రితమే అప్పటి ప్రభుత్వానికి అందజేశారు. అయినా ఇప్పటి వరకు పరిహారం చెల్లించిన దాఖలాలు లేవు.

సజావుగా ఇంటర్ ప్రాక్టికల్స్

ఏసీసీ, ఫిబ్రవరి 2: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా సజావుగా జరిగాయి. ఉదయం నిర్వహించిన పరీక్షకు జనరల్ 773 మంది విద్యార్థులకు గాను 739, ఒకేషనల్ 610 మందికి 501 మంది హాజరయ్యారు. మొత్తం 1,383 మంది విద్యార్థులకు గాను 1,240 మంది పరీక్షలు రాశారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలో జనరల్ 449 మందికి 432 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌లో 656 మందికి 623 మంది పరీక్ష రాశారు. మొత్తం 1,105మందికి 1,055 మంది పరీక్షకు హాజరయ్యారు. 36 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జన్నారం, ఫిబ్రవరి 2: మండలంలోని రేండ్లగూడలో నిర్మిస్తున్న రామలయానికి గ్రామానికి చెందిన అల్లం నరేష్ రూ. 60 వేల విరాళాన్ని శుక్రవారం గ్రామ పెద్దలకు అంద జేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు నెమలి కొండ ఆశారాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

హాజీపూర్, ఫిబ్రవరి 2: ముల్కల గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహిం చారు. ముల్కల్ల ఆరోగ్యకేంద్రం, ఆర్‌బీఎస్‌కే టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్న విద్యార్థులకు మందులు అందజేశారు. విద్యార్థులు రక్తహీనత తలెత్తకుండా సరైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోహన్, మెడికల్ ఆఫీసర్ నాందేవ్, ఏఎన్‌ఎం లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరవధిక దీక్ష

- క్లోజింగ్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని కార్మికుల డిమాండ్

ఏసీసీ, ఫిబ్రవరి 2: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శాలి వాహన పవర్ ప్లాంటు ఎదుట కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. కార్మికుల హక్కుల సాధన కోసం భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్మిక సంఘం నాయకులు ఎడ్ల శ్రీనివాస్, కుంటాల శంకర్ మాట్లాడుతూ పవర్‌ప్లాంట్ మూసివేసి 14 నెలలు కావస్తున్నా కార్మికులకు చట్ట ప్రకారం చెల్లించాల్సిన క్లోజింగ్ బెనిఫిట్స్ చెల్లించకుండా ప్లాంటు అధినేత మల్క కొమురయ్య మొండిగా వ్యవహ రిస్తున్నారన్నారు. మంచిర్యాల అసిస్టెంట్ లేబర్ కమిషనర్ గతంలో కార్మికులకు యాజ మాన్యానికి నిర్వహించిన జాయింట్ మీటింగ్‌లో కూడా బెనిఫిట్స్ చెల్లిస్తామని యాజమాన్యం ఒప్పుకుందన్నారు. ఇప్పటికి చెల్లించకుండా కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ప్లాంటు నిర్మాణ సమయంలో రూ. 30 వేలు, రూ.40 వేల మధ్య ఎకరంభూమి కొనుగోలు చేసి భూని ర్వాసితులకు కూడా న్యాయం చేయలేదన్నారు. ప్రస్తుతం ప్లాంటు భూముల విలువ భారీగా పెరగడంతో వాటిని విక్రయించి కార్మికులకు బెనిఫిట్స్ చెల్లించకుండా జారుకోవాలని కుట్రలు పన్నుతుందన్నారు. వెంటనే తమకు న్యాయం చేయాలన్నారు.



దీక్షలో కూర్చున్న శాలివాహన ప్లాంటు కార్మికులు

కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు కమలాకర్, రాజు యాదవ్ సత్యనారాయణ, ఆనందరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సమ్మె నోటీసు అందజేత

నస్పూర్, ఫిబ్రవరి 2: తెలంగాణ ఐకేపీ ఉద్యోగుల, గ్రామ పంచాయతీ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయు) ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఆయా శాఖల అధికారులకు నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో డీపీవో, డీఆర్‌డీవోలకు శుక్రవారం అందజేశారు. గ్రామ పంచాయతీ, ఐకేపీ వీవోఏలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలన్నారు. బంద్‌లో జిల్లాలోని అసంఘటిత రంగాల కార్మికులు, వ్యవసాయ, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారం, ఐకేపీ వివోఏ ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి వెంకటేశ్, జిల్లా అధ్యక్షకార్యదర్శులు కుంటల కుమార్, దుర్గం రాము, నాయకులు పొట్ట పోశం, రజిత, శ్రీనివాస్ సమ్మయ్య, రమేశ్ తదిత రులు పాల్గొన్నారు.

పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన రవీందర్

ఏసీసీ, ఫిబ్రవరి 2: మంచిర్యాల పట్టణ ఇన్స్‌పెక్టర్‌గా రవీందర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకు ఇక్కడ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహించిన ముష్కె రాజుని బదిలీ చేస్తూ ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.



రవీందర్

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులు

- ముగిసిన పంచాయతీ పాలకవర్గం పదవీకాలం

దండేపల్లి, ఫిబ్రవరి 2: దండేపల్లి మండలంలోని 31 గ్రామ పంచాయతీ కార్యలయాలలోని సర్పంచుల పదవికాలం ముగియడంతో శుక్రవారం గ్రామ పంచాయతీలో మండలస్థాయి గజిటెడ్ అధికారులు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలను స్వీకరించారు. మ్యాదరిపేట, పాత మామిడిపల్లి, కొత్త మామిడిపల్లి జీపీలకు తహసీల్దార్ సంధ్యరాణి, దండేపల్లి, నెల్కివెంకటాపూర్, వందూర్‌గూడ జీపీలకు వేముల మల్లేషం, కర్ణపేట, నర్సాపూర్, తానిమడుగు జీపీలకు డిప్యూటి తహసీల్దార్ విజయ, చిల్కగూడ, రెబ్బనపల్లి, నంబాల జీపీలకు మండల పశువైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారు. చింతపల్లి, కోర్విచెల్మ, ముత్యంపేట జీపీలకు మండల వ్యవసాయశాఖ అధికారి గొర్ల అంజిత్‌కుమార్, ధర్మరావుపేట, ద్వారక, పెద్దపేట, లక్ష్మికాంతపూర్ జీపీలకు మండల పంచాయతీరాజ్ అధికారి ఎంపీవో శ్రీనివాస్, ఆల్లీపూర్, గుడిరేవు, లింగాపూర్ జీపీలకు పంచాయతీరాజ్ ఇంజనీర్ పిఆర్ఏఈ విక్రమ్‌రెడ్డి, మాకులపేట, నాగసముద్రం,తాళ్లపేట రాజుగూడ జీపీలకు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శిరీషా, కన్నెపల్లి, గూడెం జీపీలకు మిషన్‌భగీరథ ఏఈ అరుణ్‌కుమార్, వెల్గనూర్, కాసిపేట, కొండాపూర్ జీపీలకు నీటి పారుదలశాఖ ఏఈ విజయభాస్కర్‌లు గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా పదవీ బాధ్యతలు చేపట్టారు.

హాజీపూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. ముల్కల్లలో ఎంపీడీ వో ఎంఏ హై, బుద్దిపెల్లి, దొనబండ గ్రామాల్లో పశువైద్యురాలు సరిత, చిన్న గోపాల్‌పూర్‌లో పంచాయతీ ఇంజీనర్ కామేశ్వర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గడ్‌పూర్, గుడిపేట గ్రామాల్లో ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, కర్ణమామిడి, నమ్నెపల్లి గ్రామాల్లో డిప్యూటి తహసీల్దార్ హరిత, పడ్తన్‌పల్లిలో మిషన్ భగీరథ ఏఈ గిరిజ, టీకనపల్లిలో వ్యవసాయాధికారిణి రజితలు బాధ్యతలు స్వీకరించారు.

చెన్నూరు: సర్పంచుల పదవీ కాలం ముగియడంతో 30 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికా రులను నియమించగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రత్యేకాధికారులుగా గ్రామపంచాయతీలకు తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ చేతన్, పశువైద్యాధికారి శ్రీనివఆస్, డిప్యూటి తహసీల్దార్ సంతోష్, ఎంపీవో అజ్మత్ ఆలీ, ఏఈ పీఆర్ శివకుమార్,ఐసీడీఎస్ సీడీపీవో మనోరమ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సరితలు బాధ్యతలు స్వీకరించారు.

మందమర్రిరూరల్: మండలంలోని 10 గ్రామపంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను ప్రభుత్వం కేటాయించింది. అందుగులపేట ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో శశికళ, పులిమడుగుకు తహసీల్దార్ కె చంద్రశేఖర్, ఆదిల్‌పేటకు మనోజ్‌కుమార్, బొక్కలగుట్టకు సుమన్‌కుమార్, చిర్రకుంటకు ఏ. రాజశేఖర్, మామిడిగట్టుకు ఎంఏ వసీం, పొన్నారం ప్రత్యేకాధికారిగా సునీత, సారంగపల్లికి సీహెచ్ రమ్య, శంకర్‌పల్లికి రాజేశం, వెంకటాపూర్‌కు బీరయ్యను నియమించారు.

వేమనపల్లి: ప్రత్యేకాధికారులు మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిం చారు. రాజారాం, గొర్లపల్లి గ్రామాలకు తహసీల్దార్ సదానందం, వేమనల్లి, నాగారం గ్రామాలకు ఎంపీడీవో లక్ష్మయ్య, బుయ్యారం, జిల్లెడ గ్రామాలకు ఏవో వీరన్న, కేతనపల్లి,చామనపల్లి గ్రామాలకు వెటర్నరీ డాక్టర్ అరుణ, సూరారం, దస్నాపూర్ గ్రామాలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్, సుంపుటం,కల్లెంపల్లి గ్రామాలకు డిప్యూటి తహసీల్దార్ గోవింద్ నాయక్, నీల్వాయి, ముల్కలపేట గ్రామలకు ఎంపీవో శ్రీపతి బాపురావు నియమితులయ్యారు.

కన్నెపల్లి: సర్పంచుల పదవీ కాలం ముగియడంతో శుక్రవారం ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. కన్నెపల్లి, లింగాల గ్రామాలకు ఎంపీడీవో రాధాకిషన్, గొల్లగట్టు, జజ్జరవెల్లి గ్రామాలకు తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, జన్కాపూర్,టేకులపల్లి గ్రామాలకు డిప్యూటి తహసీల్దార్ గోవర్ధన్, మాడవెల్లి , సాలిగాం గ్రామాలకు వ్యవసాయాధికారి శ్రీకాంత్‌ను నియమించారు. వీరాపూర్,ముత్తాపూర్ గ్రామాలకు పంచాయతీరాజ్ ఏఈ కళ్యాణ్‌రెడ్డి,పోలంపల్లి, సుర్జాపూర్‌గ్రామాలకు ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వర్లు, రెబ్బెనకు వెటర్నరీ డాక్టర్ హారిక, నాయకునిపేటకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు.

భీమిని: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. భీమిని గ్రామానికి జవహర్ లాల్(ఎంపీడీవో), అక్కలపల్లికి రాంచందర్(ఏఈ), బిట్టూరుపల్లికి షేక్ సఫ్దార్ అలీ(ఎంపీవో), చిన్నగుడిపేటకు సందీప్(పశు వైద్యుడు)ని నియమించారు. చిన్నతిమ్మాపూర్‌కు జవహర్‌లాల్ (ఎంపీడీవో), ఖర్జీభీంపూర్‌కు అంజయ్య(డీటీ రెవెన్యూ), కేస్లాపూర్‌కు షేక్ సఫ్దార్ అలీ(ఎంపీవో), లక్ష్మీపూర్‌కు విజయ్‌కు మార్ (ఏవో), మల్లీడికి బికర్ణదాస్ (తహసీల్దార్)ను నియమించారు. పెద్దపేటకు విజయ్‌కుమార్ (ఏవో), వీగాం పోషం(ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్), వెంకటాపూర్ సఫ్దార్ అలీని నియమించారు.

భీమారం: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. బీమారం, పోలంపల్లిలో ఎంపీవో సతీష్‌రెడ్డి, ఆరేపల్లిలో తహసీల్దార్ విశ్వంబర్, బూరుగుపల్లిలో వెటర్నరీ వైద్యుడు రాకేశ్ శర్మ, దాంపూర్, ధర్మారంలలో ఇరిగేషన్ ఏఈ అఖిల్, ఎల్కేశ్వరం, కొత్తపల్లిలో నాయబ్ తహసీల్దార్ కృష్ణ, ఖాజీపల్లి, నర్సింగాపూర్‌లలో ఎంపీడీవో శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు.



సోనాపూర్‌లో బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ వినయ్

నెన్నెల: పంచాయతీల్లో శుక్రవారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఆవడం, గంగారంలకు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ దిలీప్, కొత్తూరు, చిన్నవెకంటాపూర్‌లకు నాయబ్ తహసీల్దార్ ప్రకాష్, చిత్తాపూర్, జంగాల్‌పేటలకు ఎంపీడీవో వరలక్ష్మికి బాధ్యతలు అప్పగించారు. ఘన్‌పూర్, జెండావెంకటాపూర్‌లకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ టి. శ్రీనాథ్, నెన్నెల, గొళ్లపల్లి, జోగాపూర్‌లకు మండల పంచాయతి ఆఫీసర్ శ్రీనివాస్, గుండ్లసోమారం, నార్వాయిపేటలకు మండల వ్యవసాయ అధికారి ప్రేమ్‌కుమార్, కోనంపేట, కుశ్నపల్లిలకు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గోవింద్ చంద్ సర్దార్‌ను నియమించారు. మైలారం, నందులపల్లిలకు తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌పఠాన్ స్పెషల్ ఆఫీసర్లుగా నియమి తులయ్యారు.

కాసిపేట: సర్పంచుల పదవీ కాలం ముగియడంతో పంచాయితీల్లో ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని 22 గ్రామాల్లో ఆయా శాఖల అధికారులు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అధికారులను ప్రజాప్రతినిధులు, ప్రజలు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఎంపీడీవో ఆలీం, తహసీల్దార్ భోజన్న, ఎంపీవో నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ వినయ్ బాధ్యతలు స్వీకరించారు.

తాండూర్: తాండూర్, కిష్టంపేట గ్రామాల్లో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, అచ్చలాపూర్, గోపాల్‌నగరంలలో తహసీల్దార్ రోహిత్‌పాండే, మాదారం, రాజీవ్ నగర్‌లలో నాయబ్ తహసీల్దార్ ప్రసాద్, బోయపల్లి,చౌటుపల్లి గ్రామాల్లో వ్యవసాయాధికారిని కిరణ్మయి ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. మాదారం త్రి ఇంక్లైన్, నర్సాపూర్ గ్రామాల్లో వెటర్నరీ అధికారి భూమయ్య, ద్వారకాపూర్, కాసిపేట గ్రామాల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కళ్యాణ్‌రెడ్డి, కొత్తపల్లి,రేచిని గ్రామాల్లో మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ, నీలాయపల్లి గ్రామంలో వెటర్నరీ అధికారి నరసింహరావు బాధ్యతలు స్వీకరించారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

- ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి భారతి లక్‌పతినాయక్



మాట్లాడుతున్న భారతి లక్‌పతినాయక్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 2: స్పష్టమైన జాబితా రూపొందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి భారతి లక్‌పతినాయక్ అన్నారు. నిర్మల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులతో ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా భారతి లక్‌పతినాయక్ మాట్లాడారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం 2024లో భాగంగా 6,7,8 ఫారాల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. తప్పులు లేని స్పష్టమైన జాబితా రూపొందించాలన్నారు. నూతన ఓటరు నమోదు చేసేందుకు వయస్సు నిర్ధారణకు జనవరి 1, 2024ను ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. ఈ నెల 6న పారామీటర్లు పరిశీలించి తుది జాబితా ప్రచురణకు ఎన్నికల సంఘం అనుమతి పొంది పూర్తి వివరాలతో జాబితా రూపొందిచనున్నామని తెలిపారు. 8న తుది జాబితా ప్రచురించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నూతన ఓటరు నమోదు, జాబితా సవరణలపై జిల్లా వ్యాప్తంగా ప్రజలందరికి తెలిసేలా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో వివరాలు నమోదు చేసుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలోని మంచిర్యాల నియోజకవర్గంలో 287, చెన్నూరులో 227, బెల్లంపల్లిలో 227 పోలింగ్ కేంద్రాల్లో 741 మంది బూత్ స్థాయి అధికారులను నియమించామని తెలిపారు. కార్యక్రమంలో నిర్మల్, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు ఆశీష్ సంగ్వాన్, హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్లు రాహుల్, శ్యామలదేవి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ అధికారులు, బూత్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విపత్తులపై ప్రజలకు అవగాహన

హాజీపూర్, ఫిబ్రవరి 2: ప్రకృతి విపత్తులు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం గుడిపేటలోని ఎల్లంపల్లి డ్యాం వద్ద ప్రజలకు విపత్తుల ప్రతి స్పందన దళం విజయవాడ 10వ బెటాలియన్ కమాండెంట్ బీటెన్ సింగ్ అవగాహన కల్పించారు. ప్రకృతి విపత్తులు, రోడ్డు ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు, వరదలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన రక్షణ చర్యలు, జాగ్రత్తలపై వివరించారు. 2006లో ఎన్‌డీఆర్ఎఫ్ స్థాపించినప్పటి నుంచి దేశ వ్యాప్తంగా 1.60 లక్షల మందిని విపత్తుల నుంచి కాపాడామని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గోవిందరావు, ప్రాజెక్టు ఏఈలు రాజ్‌కుమార్, శివ సాగర్, రెవెన్యూ ఆర్ఐలు ప్రభు, మంగ పాల్గొన్నారు.

అండర్-14 జిల్లా రగ్బీ జట్ల ఎంపిక



ఎంపికైన బాలికల జట్టు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 2: జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లోని విశ్వశాంతి పాఠశాలలో శుక్రవారం పోటీలు నిర్వహించి అండర్-14 జిల్లా రగ్బీ బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. బాలుర జట్టుకు ఈ రామ్‌చరణ్, పి. రామ్, పి లక్ష్మణ్, ఎస్ అంజన్న, కె లక్ష్మీకాంత్, డి జనార్దన్, ఎన్ మన్నా, కె శివమణి, జె వెంకటేష్, కె అనుదీప్, ఎన్ వరప్రసాద్, బి రాణా ఎంపికయ్యారు. స్టాండ్‌బైగా డి అన్వేష్, ఎస్ అఖిల్, బి అభినవ్, సీహెచ్ శశాంక్, వై గణను ఎంపిక చేశారు. బాలికల జట్టుకు కె వైష్ణవి, మేఘా టాక్, సుధీష్ణ, సనా మొహ్మద్, శ్రావణి, ప్రియా, బ్రిందా, మనస్విని, ప్రణయ ఎంపికయ్యారు. ఈ జట్లు ఈ నెల 3, 4 తేదీలలో భువనగిరి జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా పక్షాన పాల్గొంటాయి. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆవునూరి మహేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి భీమిని రాజేష్, ఆవునూరి సురేష్, పీఈటీలు రాజలింగు, కుమార్, సీనియర్ క్రీడాకారుడు బానేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



సమ్మక్క, సారాలమ్మ గద్దెలను పరిశీలిస్తున్న జీఎం మనోహర్

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 2: పాలవాగు ఒడ్డున అటవీ ప్రాంతంలో ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే సమ్మక్క, సారాలమ్మ జాతర ఏర్పాట్లను మందమర్రి ఏరియా జీఎం మనో హర్ శుక్రవారం పరిశీలించారు. ఆయా శాఖల అధికారులతో ఏర్పాట్లపై చర్చించారు. జీఎం మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగే జాతరలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జాతరలో దుకాణాల ఏర్పాటు కోసం త్వరలో వేలం పాట నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఎం శ్యాంసుందర్, ఇతర అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

శివ్వారం మొసళ్ల కేంద్రాన్ని అభివృద్ధి చేయాలి



మొసళ్ల కేంద్రంలో పడవలో ప్రయాణిస్తున్న అటవీ శాఖ అధికారులు

జైపూర్, ఫిబ్రవరి 2: మండలంలోని శివ్వారం మొసళ్ల కేంద్రాన్ని గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఐఎఫ్ఎస్ రిటైర్డు అధికారి శ్యామల టికదర్, సైంటిస్టు డాక్టర్ ఏ. జాన్సన్, డాక్టర్ అరుణ్‌మణిదీక్షిత్‌లు సందర్శించారు. జిల్లా డీఎఫ్‌వో శివ్‌ఆశిష్‌సింగ్ వారికి స్వాగతం పలికి శివ్వారం మొసళ్ల కేంద్రంలో ఉన్న అటవీ గృహాలను, అటవీ ప్రాంతాన్ని , మొసళ్ల కేంద్రం గురించి వివరించారు. మొసళ్ల సంరక్షణ గురించి తీసుకుంటున్న చర్యలను డీఎఫ్‌వో వారికి వివరించారు. అనంతరం పడవలో వెళ్లి మొసళ్ల కేంద్రాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఫారె స్టు అధికారులు కె శివకుమార్, ఎస్ రమేష్, బాలకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మొసళ్ల కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

మండలంలోని శివ్వారం గ్రామంలో ఉన్న మొసళ్ల కేంద్రాన్ని వనదర్శిని కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చెన్నూరు పట్టణంలోని కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులు సందర్శంచారు. చెన్నూరు ఫారెస్టు డివిజన్ అధికారి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు జంతువుల నివాసాలు, వాటి మనుగడ గురించి వివరించామన్నారు. అడవులు, వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు శివకుమార్, బాలకృష్ణ, శ్రీకాంత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఫిబ్రవరి 2: దక్షిణ కాశీ వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందుగా రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునే ఆనవాయితీలో భాగంగా కొద్ది వారాలుగా భారీ సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలి వస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం వేలాది మంది భక్తులు వేములవాడకు చేరుకున్నారు. ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించిన అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని స్వామివారిని దర్శించుకొని తరించారు.శుక్రవారం సందర్భంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి లఘు దర్శనం అమలు చేశారు.

లక్ష్మీ నరసింహుడి సన్నిధిలో
మంత్రి దామోదర రాజనర్సింహ పూజలు


మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

ధర్మపురి, ఫిబ్రవరి 2: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కుటుంబ సమేతంగా శుక్రవారం ఉదయం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు, సిబ్బంది వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, స్థానిక వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య వారిని ఘనంగా ఆశీర్వదించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీని వాస్, రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరించారు.యాగశాల వద్ద నిర్వహించిన నరసింహ హోమంలో మంత్రి దామోదర రాజనర్సింహ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో స్వామి వారి నిత్య కల్యాణంలో మంత్రి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మంత్రి కు టుంబ సభ్యులకు ఆలయం పక్షాన స్వామి శేష వస్త్ర, ప్రసాదాలు అందించి సత్కరించారు.

నరసింహుని దర్శనం ఆనందంగా ఉంది

లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం ఆనందంగా ఉందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. స్వామి దర్శనం అనంతరం ఆలయం ఆవరణలో ఆయన కొద్ది సేపు విలేకరులతో మాట్లాడారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి తన ఇళ వేల్పు అన్నారు. స్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఆలయంలో నిర్వహించే నిత్య అన్నదానం కోసం ఆయన రూ 1,00,000 విరాళాలు అందించారు. అలాగే బ్రాహ్మణ సంఘం అభివృద్ధి కోసం ఆయన రూ 1,01,000 విరాళాలు అందించారు. .

ఇసుక లారీ స్వాధీనం


పట్టుకున్న ఇసుక లారీ

జైపూర్, ఫిబ్రవరి 2: మండలంలోని రసూల్‌పల్లి గ్రామం వద్ద అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నామని మైనింగ్ ఏడీ ఆర్ బాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుంచి రసూల్‌పల్లి వద్ద ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక కుప్పలు పోసి రాత్రి లారీల్లో రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు దాడి చేసి లారీని స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న లారీని జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెద్దపల్లి పార్లమెంట్‌కు రాధిక దరఖాస్తు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 2: పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ స్థానానికి టీపీసీసీ జాయింట్ కన్వీనర్ రామిళ్ల రాధిక శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు. హైరాబాద్‌లోని గాంధీ భవన్‌కు వెళ్లి దరఖాస్తు అందజేశారు.

పూలతోటకు వేలం పాట



పూల తోట ఎదుట ఐటీడీఏ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బెల్లంపల్లి, ఫిబ్రవరి 2: వాహనాలు, బంగారం, జాతరలలో దుకాణాలను వేలం పాట వేసిన సంఘ టనలను చూశాం. కానీ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఐటీడీఏ నర్సరీలో పూల తోటకు వేలం పాల పెట్టారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఎకరం భూమిలో బంతి, చామంతి పూలను సాగు చేశారు. పూలు పుష్కలంగా పెరగడంతో అధికారులు బంతి, చామంతి పూల తోటలకు వేలం పాట నిర్వహించనున్నామని పూల తోట ఎదుట అధికా రులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. శనివారం వేలం పాట నిర్వహించనున్నామని అందులో పెట్టారు. వేలం పాటలో పాల్గొనే వారు 76589 81299లో సంప్రదించాలని ఐటీడీఏ సూపర్‌వైజర్ పూజ గురువారం తెలిపారు. రైతులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

10న 'నవోదయ' ప్రవేశ పరీక్ష

చొప్పదండి, ఫిబ్రవరి 2: నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 10న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మంగ తాయారు ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం 1,745, 11వ తరగతిలో ప్రవేశాలకు 1,144 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరి కోసం కరీంనగర్‌లో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హాల్ టికెట్‌లను ఆన్‌లైన్‌లో ఉంచామని, డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

క్లాత్ స్టోర్‌లో అగ్ని ప్రమాదం

కొడిమ్యాల, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని శ్రీసుమంగళి క్లాత్ స్టోర్‌లో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు బుర్ర సంతోష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదంలో దుకాణంలో ఉన్న పట్టు చీరెలతో పాటు ఫర్నిచర్ కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. ప్రమాదం ఎలా జరిగింది అనేది తెలియటం లేదు. సంఘటన స్థలాన్ని హెడ్ కానిస్టేబుల్ అర్జరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వి రవీందర్ పరిశీలించారు.

దేశవ్యాప్త సమ్మెకు మద్దతు ఇవ్వండి



నోటీసు అందజేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 2: కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 16న దేశవాప్తంగా నిర్వహించే సమ్మెకు మద్దతు ఇవ్వాలని సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ కోరారు. రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘాలు హెచ్ఎంఎస్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలతో కలిసి సమ్మె చేస్తున్నామన్నారు. కార్మికుల సొంతింటి కలను నిజయం చేయాలని, అలవెన్సులపై పన్ను మాఫీ చేయాలని, కొత్త అండర్ గ్రౌండ్ గనులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు కస్తూరి చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంగళ శ్రీనివాస్, పిట్ కార్యదర్శులు సాయిల శ్రీనివాస్, సుధాకర్, సిరికొండ శ్రీనివాస్, అంబాల శ్రీను, బాలకృష్ణ, రాజగోపాల్, కిషన్ రెడ్డి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధిహామీ దినోత్సవం

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 2: పొన్నారం గ్రామంలో ఉపాధిహామీ దినోత్సవం సందర్భంగా సిబ్బంది, కూలీలు కేక్ కట్ చేశారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీవో బీరయ్య, వ్యవసాయాకారి రాజేశం, సీనియర్ అసిస్టెంట్ రవీందర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సారయ్య, ఈసీ రఘు, రాయమల్లు, లింగయ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

6న సైన్స్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

బెల్లంపల్లి, ఫిబ్రవరి 2: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని రెండు విభాగాల సైన్స్ విద్యార్థులు ఈ నెల 6న చెన్నూరులోని మల్బరీ ప్లాంటేషన్‌లో క్షేత్ర పర్యటన చేయనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల జువాలజీ, బాటని విభాగాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సైన్స్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదర్శం.. ఆహ్వానం

- మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ
- 6 నుంచి పదో తరగతి వరకు ఖాళీలు
- దరఖాస్తుల స్వీకరణకు ఫిబ్రవరి 22 తుది గడువు
- ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు
- జిల్లాలో 5 ఆదర్శ పాఠశాలలు

గ్రామీణ విద్యార్థులకు మంచి అవకాశం



గ్రామీణ నిరుపేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇది మంచి అవకాశం. మోడల్ స్కూల్‌లో మెరుగైన సౌకర్యా లతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణంతో అన్ని వసతులతో కూడిన ఆంగ్లమాధ్యమ విద్యను అందిస్తున్నాం. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాం. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- టి లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్, కోటపల్లి ఆదర్శ పాఠశాల

కోటపల్లి, ఫిబ్రవరి 2: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆంగ్లమాధ్యమంలో విద్యను అందించేందుకు జిల్లాలోని ఆదర్శ పాఠశాలలు ఆహ్వానం పలుకుతున్నాయి. జిల్లాలోని ఐదు పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రతీ పాఠశాలలో 6వ తరగతిలో వంద సీట్ల చొప్పున మొత్తం 500 సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశాలు కల్పించనున్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఫిబ్రవరి 22 వరకు గడువు ఉంది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన అందిస్తూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుతుండడంతో మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు పోటీ పెరుగుతుంది. 2024-25 విద్యా సంవత్సరంలో 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులకు మంచి అవకాశం.



కోటపల్లిలోని ఆదర్శ పాఠశాల

● అధునాతన వసతులు

ఆదర్శ పాఠశాలలో పక్కా భవనాలతో పాటు విశాలమైన గదులు, పాఠ్యాంశాల వారీగా ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, వృత్తి విద్యకు సంబంధించిన ఏర్పాట్లు కల్పించారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తున్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధిస్తూ సీసీ కెమెరాల ద్వారా విద్యార్థులను పర్యవేక్షిస్తున్నారు. ఎన్ఎంఎంఎస్, ఎంసెట్, నీట్‌కు సంబంధించి ప్రత్యేక తరగతుల నిర్వహణ, పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులతో పాటు ఇంటర్‌లో చదివే బాలికలకు హాస్టల్ వసతి కల్పిస్తున్నారు.

● ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఇలా..

6 నుంచి 10వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ఇందుకు ఆధార్‌కార్డు, బోనఫైడ్, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్‌ఫొటోతో మీసేవ కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు రూ.125, జనరల్ విద్యార్థులు రూ.200 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు ఫిబ్రవరి 22 చివరి గడువు కాగా ఈలోగా దరఖాస్తులు చేసుకుని కాపీని ఆదర్శ పాఠశాలలో అప్పగించాలి. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. 6వ తరగతి పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 వరకు, 7 నుంచి 10వ తరగతి ప్రవేశాలకు పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఉంటుంది.

● రాత పరీక్ష ఇలా..

తెలుగు, ఆంగ్లమాధ్యమాల్లో వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. 5వ తరగతి సామర్థ్యానికి అనుగు ణంగా తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం, ఆంగ్ల పాఠ్యాంశాలపై 25 మార్కుల చొప్పున ఐచ్ఛిక తరహాలో ప్రశ్నలు ఇస్తారు. వీటిలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశానికి అవకాశం కల్పిస్తారు. అయితే స్థానిక మ ండలానికి సంబంధించిన విద్యార్థులకు ప్రవేశాల తర్వాతే ఇతర మండలాల విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇంద్రవెల్లి సభకు తరలి వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

- జెండా ఊపి వాహనాలను ప్రారంభించిన నాయకులు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 2: జిల్లా నుంచి ఇంద్రవెల్లి సభకు కాంగ్రెస్ శ్రేణులు తరలివెళాయి. ఇంద్రవె ల్లిలో నిర్వహిస్తున్న పార్లమెంట్ ఎన్నికల శంఖారావం సభకు ప్రత్యేక వాహనాలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సొత్కు సుదర్శన్, ఉపేందర్‌గౌడ్, గుడ్ల రమేశ్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పుల్లూరి లక్ష్మణ్, దుర్గ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు. కాగా పాత బస్టాండ్ ఏరియాలో బండి సదానందం యాదవ్ నేతృత్వంలో ఇంద్రవెల్లిసభకు తరలి వెళ్లారు. మార్కెట్ ఏరియాలో ఎండీ ఇసాక్, జావెద్ ఖాన్ నేతృత్వంలో ఇంద్రవెల్లి సభకు తరలివెళ్లారు. ఉదయమే ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కూడా తన వాహనంలో సభకు తరలివెళ్లారు.

బెల్లంపల్లి: ఇంద్రవెల్లిలో నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సభకు బెల్లంపల్లి పట్టణం నుంచి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. పట్టణాధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య , మాజీమున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, టీపీసీసీ సభ్యులు చిలుముల శంకర్, కంకటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు.

దండేపల్లి: మండలం నుంచి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖల ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకులు ఇంద్రవెల్లి భారీ బహిరంగ సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హాజీపూర్: మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు బస్సుల్లో తరలివెళ్లారు. కాంగ్రెస్ నాయకులు గోనె సతీష్‌రావు, సురేందర్, సత్తయ్య, చంద్రమౌళి , కుమార్‌యాదవ్, తిరుపతి, సమ్మయ్య, లింగయ్య , లచ్చయ్య లతో పాటు నాయకులు, కార్తకర్తలు తరలివెళ్లారు.



మందమర్రి నుంచి ఇంద్రవెల్లి సభకు తరలి వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

మందమర్రిరూరల్: అందుగులపేట, చిర్రకుంట, తదితర గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో మ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ఆధ్వర్యంలో బస్సుల్లో ఇంద్రవెల్లికి తరలి వెళ్లారు. కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి కడారి జీవన్‌కుమార్, ఒడ్నాల కొమురయ్య, కాల్వ కుమార్, రాజయ్య, శేఖర్, నాజర్, హన్మంతు, మల్లేష్, పోశం తదితరులు తరలివెళ్లారు.

భీమిని: మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి సభకు తరలివెళ్లారు. గ్రామాల వారిగా ప్రత్యేక వాహనాల్లో ఇంద్రవెల్లి సభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రానున్న రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ రవీందర్ రావు, సతీష్, నరేష్, సురేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును ఎత్తివేయాలి

- ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త

బెల్లంపల్లి, ఫిబ్రవరి 2: బెల్లంపల్లిలో అనధికారికంగా జనావాసాలకు సమీపంలో నిర్వహిస్తున్న మున్సిపల్ డంపింగ్‌యార్డును ఎత్తివేయాలని సామాజిక కార్యకర్త రంగ ప్రశాంత్ హైదరాబాద్‌లోని మహాత్మాజ్యోతిబాఫూలే ప్రజాభవన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. బెల్లంపల్లిలోని గోల్‌బంగ్లా బస్తీని ఆనుకుని ఉన్న స్థలంలో చెత్తను డంప్ చేస్తున్నారని, చెత్తకు నిప్పు పెడుతుం డడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీంతో పలువురు వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. సమీపంలోని గురుకుల కళాశాల, పాఠశాలలు ఉం డడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతు న్నారన్నారు. కార్యక్రమంలో సందీప్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

భీమారం, ఫిబ్రవరి 2: ఇటీవల బదిలీపై వెళ్లిన భీమారం ఉన్నత పాఠ శాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవీందర్, శ్రీనివాసరావు, శ్రీమూర్తి, సృజన, వెంకటస్వామిలను శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు విక్రమ్‌కు మార్ సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాసరావు, తిరుపతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

భీమారం, ఫిబ్రవరి 2: భీమారం గ్రామపంచాయతీ సర్పంచు, వార్డు సభ్యుల కాలపరిమితి ముగియడంతో శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచు గద్దె రాంరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది సర్పంచు, వార్డు సభ్యులను ఘ నంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు గద్దె రాంరెడ్డి, నరహరి, ప్రణీత్ విశాల్, కిష్టయ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పంచాయతి పాలకవర్గానికి సన్మానం

నెన్నెల, ఫిబ్రవరి 2: ఘన్‌పూర్ సర్పంచ్ పంజాల లక్ష్మి-సాగర్‌గౌడ్ దంపతులను, వార్డు సభ్యులను ఎంపీపీ సంతోషం రమాప్రతాప్‌రెడ్డి శుక్రవారం సన్మానించారు. పంచాయతి పాలకవర్గానికి గ్రామస్థులు ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన జీపీను అభివృద్ధి చేయడంలో సర్పంచ్ కృషి చేశారని కొనియాడారు. గ్రామ అభివృద్ధికి సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కాసిపేట, ఫిబ్రవరి 2: మండలంలోని కోమటిచేనుకు చెందిన రత్నం ధర్మయ్య ఇటీవ ల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం స్థానిక యువ రాజ్యం యువజన సంఘం సభ్యులు కుటుంబాన్నిపరామర్శించారు. కొంత నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాస్, కిరణ్, సుధాకర్, రమేశ్, శేఖర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారులు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 2: ఆసిఫాబాద్ మండలంలోని ఆయా గ్రామపంచాయతీలలో శుక్రవారం ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్ కె రమేష్ అంకుశాపూర్, బాబాపూర్, ఎంపీడీవో శశికళ అడ, మానిక్‌గూడ, ఎల్లారం, ఎంపీవో ప్రసాద్ బూర్గుడ, మోతుగూడ, పీఆర్ఏఈ రాంకిరణ్ ఈదులవాడ, చిలాటిగూడ, డీటీ రాజ్‌కుమార్ మోవాడ్, వెంకటపూర్, సీడీపీవో సాదియా రుక్సాన గుండి, గోవింద్‌పూర్, ఏవో ఖాదర్‌హుస్సేన్ రహపల్లి, అప్పపెల్లి, వెటర్నరీ డాక్టర్ మురళీకృష్ణ చిర్రకుంట, పాడిబండ, హార్టికల్చర్ అధికారి నదీం అడదశ్నాపూర్, వావుదాం, డీటీ పోచయ్య తుంపల్లి, కౌటగూడ, కోసార, మాలన్‌గొంది, ఏఈ నవ్య సాలేగూడ, ఏఈ శ్రీనివాస్ రౌటసంకెపల్లి, డీటీశ్యాంలాల్ చోర్‌పల్లి పంచాయతీలలో బాధ్యతలు స్వీకరించారు.

వాంకిడి: షేక్ మొహమ్మద్‌కి వాంకిడి, ఎంపీడీవో శివకుమార్‌కు ఇందాని, ఖిరిడి, లెండిగూడ, తహసీల్దార్ రహీముద్దీన్‌కు బంబార, గోయగాం, సోనాపూర్, ఎంఈవో మనుకుమార్‌కు చోపన్‌గూడ, పాటగూడ, పిప్పర్ గొంది, పశువైద్యాధికారి శివప్రసాద్‌కు దాబా, దోడ్డిగూ, సవాతి, ఏవో మిలింద్‌కుమార్‌కు ఖమాన, కోటిగూడ, కనర్‌గాం, పీఆర్ఏఈ బెండార, జైత్‌పూర్, సామెల, ఐటీడీఏ ఏఈ నజీముద్దీన్ నవేదరి, చిచ్చుపల్లి, సరండి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శైలేందర్‌కు నవేగాం,నవెగూడ,తేజాపూర్, డీటీ శ్రావణ్‌కుమార్ జంబుల్‌ధరి, లక్ష్మీపూర్, వెలిగి గ్రామపంచాయతీలకు బాధ్యతలు చేపట్టారు.

తిర్యాణి: మండలంలోని గ్రామపంచాయతీల్లో శుక్రవారం ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు. తిర్యాణి గ్రామ పంచాయతీలో జిల్లా ట్రైబల్‌వెల్ఫేర్ అధికారిణి రమాదేవి బాధ్యతలు చేపట్టారు. అలాగే ఆయాగ్రామపంచాయతీల్లో సైతం ఆయాశాఖల అధికారులు బాధ్యతలు చేపట్టారు.

కెరమెరి: కెరమెరిలోని అన్ని గ్రామపంచాయతీల్లో శుక్ర వారం ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు. ఆడె ప్రకాష్ గోయగాం, ధనోరా, పార్డి, జి.సంతోష్ కుమార్ కేస్లాగూడ, మెట్టపిప్పిరి, బాబేఝరి, కరంజీవాడ, ఏవో గోపికాంత్ సాకడ, సాంగ్వీ, ఖైరి, తహసీల్దార్ మునవర్ షరీఫ్ సుర్దాపూర్,రింగన్‌ఘాట్, సావర్‌ఖేడ, ఎంపీడీవో మహేందర్ కెరమెరి, కోటారి, నిశాని, సంతోష్‌కుమార్ బోలాపటార్,ముక్దంగూడ, స్వర్ణలత మోడి, ఝరి, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ విశ్వేశ్వర్ ఇందాపూర్, గోండ్‌గూడ, అగర్‌గూడలో బాధ్యతలు చేపట్టారు.



ఆసిఫాబాద్ మండలం బూర్గుదలో బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి ప్రసాద్

బెజ్జూరు: గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసిపోవడంతో గ్రామ పంచాయతీలలో ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. శుక్రవారం మండలంలోని 22గ్రామపంచాయతీలో వివిధశాఖల అధికారులు బాధ్య తలు స్వీకరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అభిలాష్‌కు బారెగూడ, పోతెపల్లి,ముంజంపల్లి, తహసీల్దార్ భూమేశ్వర్‌కు కుశ్నపల్లి, పెద్దసిద్దాపూర్, డీటీ భీమ్లాకు తలాయి, పాపన్నపేట, సులుగుపల్లి, ఎంపీడీవోకు రెబ్బెన, తుమ్మలగూడెం, కుంటలమానేపల్లి, జిల్లా ఉద్యానవన అధికారి వెంకటేశంకు బెజ్జూరు, పంచాయతీ రాజ్ ఏఈ మక్బుల్ హుస్సేన్‌కు కుకుడ, అంబగట్టు, కాటేపల్లి, వ్యవసా యాధికారి రాజులనాయుడుకు లంబాడీగూడ, ఊట్‌పల్లి, సారంగపల్లి, మర్తిడి, ఎంపీవో రమేష్‌రెడ్డికి మొగవెల్లి, సోమిని, సుష్మీర్, అందుగులగూడ గ్రామ పంచాయతీకులకు ప్రత్యేకఅధికారులుగా నియమించడంతో వారంతా ఆయా గ్రామ పంచాయతీల్లో బాధ్యతలు స్వీకరించారు.

చింతలమానేపల్లి: మండలంలో 19గ్రామ పంచాయతీలకు గాను తహసీల్దార్ నాగరాజుగౌడ్‌కు దిందా, గూడెం,కర్జవెల్లి, రుద్రాపూర్,రన్‌వెల్లి, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి బాబాసాగర్, బాబాపూర్, బూరెపల్లి, రవీంద్రనగర్-1, రవీంద్రనగర్-2, డీటీ మహ్మూల్ అలీకి బాలాజీ అనుకోడ, డబ్బా, గంగాపూర్, లంబాడీహెట్టి, ఏఈ ఉదయ్‌కి ఆడిపల్లి, హేటిగూడ, కోర్సిని, కోయపల్లి గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమించారు.


కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ మండలంలోని వివిధ గ్రామపంచాయతీలకు అధికారులను నియమించారు. అందవెల్లికి నాయబ్ తహసీల్దార్ రఘునాథ్, అనుకోడకు ఎంపీవో గౌరీశంకర్, అంకుసాపూర్‌కు సీడీపీవో సురేఖ, బారెగూడకు పీజీ హెచ్ఎం పి చంద్రశేఖర్, బసంతినగర్‌కు ఎంపీవో గౌరిశంకర్, భట్టుపల్లికి ఎంపీడీవో జి సత్యనారాయణ, బోడపల్లికి నాయక్ తహసీల్దార్ రఘునాథ్, బురదగూడెంకు ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ గోపీచంద్, చింతగూడకు, చింతగూడ కోయవాగుకు తహసీల్దార్ కిరణ్‌కుమార్, దుర్గానగర్, ఈసుగాంకు ఎంపీవో గౌరీశంకర్, గన్నారం తహసీల్దార్ కిరణ్‌కుమార్, జగన్నాథ్‌పూర్ నాయబ్ తహసీల్దార్ రఘునాథ్, కడంబాకు ఎంఎన్‌వో జె దేవాజీ, కోసినికి డిప్యూటీ ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ ఎంఏ సిద్దికి, కొత్తసార్సాలకు మండల హార్టికల్చర్ అధికారిణి శాంతిప్రియ, లైన్‌గూడ వ్యవసాయాధికారి రామకృష్ణ, మాలిని ఏఈ రాజ్‌కుమార్, మోసం ఎంఎన్‌వో దేవాజీ, నాగంపేట రామకృష్ణ, నజ్రూల్‌నగర్ శ్రీనివాస్, ఎన్టీఓఎస్ కాలనీ సత్యనారాయణ, రాంనగర్ సత్యనారాయణ, రాస్పెల్లి శాంతిప్రియ, రేగులగూడ ఎంఏ సిద్దికి, వల్లకొండ రామకృష్ణ, వంజీరి గోపిచంద్‌ను కేటాయించారు. ఉత్తర్వులు అందిన వారు శుక్రవారం పలు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో బాధ్యతలు చేపట్టారు.

రెబ్బెన: రెబ్బెన మండలంలోని గ్రామపంచాయతీలకు శుక్రవారం వివిధఅధికారులు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. గోలేటి ఇందిరానగర్, కొండపల్లికి ఎంపీడీవో శ్రీనివాస్, కిష్టాపూర్, జక్కుపల్లి, ఖైరిగూడ, నారాయణపూర్ గ్రామాలకు తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఖైరిగాం, నవేగాం, వంకులం, రాంపూర్ గ్రామాలకు ఎంపీవో అంజాద్ బాషా, ధర్మారం, నంబాల, రాజారం గ్రామాలకు అసిస్టెంట్ ఇంజనీర్ గౌస్‌మోయినోద్దీన్, కొమురవెల్లి, పాసిగాం, గంగాపూర్ గ్రామాలకు ఏవో మంజుల, రెబ్బెనకు డీపీఆర్ఈ ప్రభాకర్, పులికుంట, రోళ్లపాడు, తక్కళ్లపల్లి గ్రామాలకు ఏఈఇరిగేషన్ సాయిజానీ, లక్ష్మీపూర్, మాదువాయిగూడ, తుంగెడకు డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మిని కేటాయించారు.

దహెగాం: మండలంలోని24గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఇట్యాల, కోత్మీర్, బోర్లకుంటకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇనోష్, కమ్మర్‌పల్లి, పెసరికుంట గ్రామపంచాయతీల్లో డీటీ లలిత, లగ్గాం, కుంచవెల్లి, పీపీరావుకాలనీకి తహసీల్దార్ కవిత, హత్తిని, ఒడ్డుగూడ, బీబ్రాకు పశువైద్యాధికారి శ్రావణ్, దిగిడ, రావులపల్లి,రాంపూర్, మొట్లగూడకు మిషన్‌భగీరథ ఏఈ గోపిచంద్, గిరివెల్లి, ఖర్జి, బామానగర్‌కు ఏవో వంశీకృష్ణ, ఐనం, కల్వాడ, చౌకకు ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, చిన్నరాస్పెల్లి, గెర్రె, చంద్రపల్లికి పీఆర్ఏఈఆత్మారాం, దహెగాం గ్రామపంచాయతీలో మత్స్యశాఖ ఏడీ విజయ్ బాధ్యతలు చేపట్టారు.

సిర్పూర్(టి): సిర్పూర్(టి) గ్రామపంచాయతీకి డీఎల్‌పీవో బాధ్యతలు చేపట్టారు.

సీవోఈ ఎంట్రెన్స్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న పొలాజు బాలరాజు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 2: సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఈ నెల 4న ప్రత్యేకంగా నిర్వహిస్తున్న కాలేజ్ ఆఫ్ ఎక్సెలెన్స్ (సీవోఈ) ఎంట్రెన్స్ ఎగ్జామ్‌కు అన్నిఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్ పొలజు బాలరాజు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆసిఫాబాద్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో ఎంపీసీ గ్రూపు 428 మంది విద్యార్థులు, సిర్పూర్ (టి) సాంఘిక సంక్షేమ బాలుర గురుకులో బైపీసీ గ్రూపు 347మంది, సిర్పూర్(టి) బాలికలలో బైపీసీ గ్రూపు347, రెబ్బెన సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఎంపీసీ 156, బైపీసీ17 మొత్తం 495మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తామని, ఉదయం 9గంటలలోపే పరీక్షకేంద్రానికి చేరుకోవాలన్నారు.

ఫూలే దంపతుల విగ్రహ ఏర్పాటు స్థలపరిశీలన

కెరమెరి, ఫిబ్రవరి 2: మండలంలోని బారెమోడి గ్రామంలో ఫూలే దంపతుల విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ స్థలపరిశీలన జరిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జ్యోతిబాఫూలే ఆశయసాధన కోసం సత్యశోధక వివాహాలు జరిపిస్తున్నామన్నారు. మాలికులస్థులంతా ఐక్యపోరాటాలు చేస్తూ హక్కులు సాధించుకో వాలని పిలుపునిచ్చారు. అనంతరం సత్యశోధక్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాలిసంఘం నాయకులు తులసీరాం, శ్యాంరావు, మనోహర్, శ్రావణ్, శంకర్ ఉన్నారు.



సత్యశోధక్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

● ముగ్గురికి గాయాలు

బెజ్జూరు, ఫిబ్రవరి 2: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే కుశ్నపల్లి గ్రామానికిచెందిన సెండెశ్రీనివాస్ ద్విచక్ర వాహ నంపై బెజ్జూరుకు వస్తున్నాడు. ఈ క్రమంలో కుశ్నపల్లి వాగు సమీపంలో రోడ్డుపై వాహనాన్ని నిలిపిఉంచగా కుశ్నపల్లి గ్రామానికి చెందిన ఔత్కార్ శంకర్ ద్విచక్ర వాహనంపై బెజ్జూరుకు వస్తూ ఆగిఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో బైక్‌పై ఉన్న సండె శ్రీనివాస్‌తోపాటు శంకర్, లోనవెల్లికి చెందిన ఔసారి కీర్తనకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు తరలించారు.

మహిళల రక్షణ కోసమే షీటీంలు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 2: బాలికలు, మహిళల రక్షణకోసమే షీటీంలు పని చేస్తున్నాయని ఆసిఫాబాద్ షీటీంఇన్‌చార్జి సునీత అన్నారు. శుక్రవారం ఎస్పీ సురేష్ కుమార్, ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు ఆదేశాలమేరకు వాసవీ హైస్కూల్‌లో షీటీంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్‌క్రైంలకు ఎవరైనా గురైనట్లయితే వెంటనే షీటీంలను సంప్రదించాలని సూచించారు. ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని లేదా ఆసిఫాబాద్ షీటీం (8712670564)ను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేశ్వర్, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ పట్టణం



నెరవేరిన కల..

● మున్సిపాలిటీగా ఆసిఫాబాద్ పట్టణం ● జీవో విడుదల చేసిన ప్రభుత్వం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 2: ఎట్టకేలకు ఆసిఫాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ మున్సిపాలిటీగా ఏర్పాటైంది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజల కల నేరవేరింది. ఆసిఫాబాద్‌ను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర మున్సిపాలిటి విభాగం డైరెక్టర్ డి దివ్య గురువారం ఉత్తర్వులను జారీచేశారు. దీంతో మేజర్ పంచాయతీగా ఉన్న ఆసిఫాబాద్ బల్దియాగా కొత్తరూపు సంతరించుకోనుంది. ఆరు సంవత్సరాల తర్జన భర్జనల తర్వాత ఎట్టకేలకు మోక్షం లభించింది. ఆసిఫాబాద్ పట్టణంతో పాటు జన్కాపూర్, గొడవెల్లి గ్రామాలను కలుపుకొని 20 వార్డులతో కూడిన మున్సిపాలిటీగా అవతరించనుంది. శుక్రవారం నుంచి పూర్తిస్థాయిలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ కార్యకలపాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కమిషనర్ అంజయ్య ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఇన్‌చార్జీ బాధ్యతలను స్వీకరించారు.

ఎట్టకేలకు జీవో జారీ..

ఆసిఫాబాద్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా నూతన జిల్లాగా ఆసిఫాబాద్‌ను ఏర్పాటు చేసింది. మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న ఆసిఫాబాద్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడంతో అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరుగలేదు. గతంలో ప్రభుత్వం ఆసిఫాబాద్‌ను మున్సిపాలిటీగా ప్రకటించినప్పటికీ ఏజెన్సీ ప్రాంతం ఉండటంతో 5వ షెడ్యూళ్లు, 1/70 చట్టం పరిధిలో ఉండటం అడ్డంకిగా మారింది. పాలనపరమైన ఇబ్బందులతో రాష్ట్రపతి అనుమతి అవసరమైంది.

దీనిపై ప్రభుత్వం పలుమార్లు చొరవచూపించినా మారిన రాజకీయ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో మధ్యే మార్గంగా మున్సిపల్ ఏర్పాటుకు ఆటం కంగా మారిన అంశాలను పరిష్కరించి వీలైనంత మేర రాష్ట్ర ప్రభుత్వం స్థాయిలోనే ఈ ప్రక్రియకు ముగింపు పలకాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆసిఫాబాద్ పట్టణంలోని 5వ షెడ్యూళ్లు, 1/70చట్టం పరిధిలోకి వచ్చే రాజంపేటను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తూ 2022డిసెంబరు 16న గత ప్రభుత్వం జీవో విడుదల చేసింది.



మున్సిపల్ కార్యాలయం

జిల్లా కేంద్రమైన ఆసిఫాబాద్ పట్టణాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేసే అంశంపై అప్పటి కేబినేట్ నిర్ణయించింది. 20 వార్డులతో కూడిన మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు అసెంబ్లీ సమావేశాల్లో గత ప్రభుత్వం తీర్మాణించి గవర్నర్ వద్దకు ఫైల్‌ను పంపింది. ఈ క్రమంలో ప్రభుత్వం పంపిన బిల్లులతో పాటు ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటు బిల్లుకు కూడ గవర్నర్ అమోద ముద్ర వేసింది. దీంతో తాజాగా నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ జీవో జారీచేసి అన్ని ఏర్పాట్లను చేసుకోవాలని అధికారులకు సూచించింది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఆసిఫాబాద్ పట్టణ ప్రజల కల సాకారం అయింది.

1913నుంచి 1940వరకు జిల్లా కేంద్రంగా కొనసాగిన ఆసిఫాబాద్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత జిల్లాల పునర్విభజనలో భాగంగా రెండోసారి కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా పేరుతో జిల్లా కేంద్రంగా ఏర్పడింది. నిజాం కాలంలో జిల్లాకేంద్రంగా వెలుగొందిన ఆసిఫాబాద్ 1940లో జిల్లా కేంద్రం ఆదిలాబాద్‌కు తరలిపోయిం ది. అయితే జిల్లా కేంద్రం తరలిపోయినప్పటికి 1961 వరకు పురపాలక కేంద్రంగా కొనసాగింది. ఆతర్వాత కాగజ్‌నగర్‌ను మున్సిపాలిటీగా మార్చడంతో ఆసిఫాబాద్ పట్టణాన్ని మేజర్ గ్రామపంచాయతీగా మార్చారు. తాజాగా ఆగస్టు2, 2019లో గత ప్రభుత్వం నూతన మున్సిపాలిటీగా ఆసిఫాబాద్‌ను ప్రకటించింది. పాలనపరమైన ఆటంకాలు ఏర్పడటంతో అది అమలుకు నోచుకోలేదు. గురువారం కొత్త ప్రభుత్వం ఆసిఫాబాద్‌ను 20 వార్డులతో కూడిన మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ జీవో విడుదల చేసింది.

నిజాం కాలంలోనే జిల్లాగా..

మారనున్న ముఖచిత్రం

ఆసిఫాబాద్ మేజర్ గ్రామపంచాయతీని 2016లో తెలం గాణ గత ప్రభుత్వం కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసింది. జిల్లా కేంద్రం అయినప్పటికీ మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో ఆశించిన స్థాయిలో పట్టణం అభివృద్ధి చెందలేదు. నిధులలేమితో అభివృద్ధి పనులు చేపట్టడంలో ఇబ్బందులు తలెత్తాయి. ఆసిఫాబాద్‌ను ప్రభుత్వం మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడంతో జిల్లా కేంద్రం ముఖచిత్రం మారనుంది. జిల్లా కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామా లైన గొడ వెల్లి, జన్కాపూర్‌తోపాటు పట్టణంలోని 20 వార్డులను కలుపుకొని మున్సిపాలిటీ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పట్టణంలోని అంతర్గత రోడ్ల నిర్మాణం, మురికి కాలువల నిర్మాణం, రోడ్ల వెడల్పు తదితర అభివృద్ధి పనులు జరుగనున్నాయి. ప్రస్తుతం ఆసిఫా బాద్ పట్టణం రాజంపేట, జన్కాపూర్, వైఎస్‌ఆర్ నగర్, ఆర్‌ఆర్‌కాలనీ, సందీప్ నగర్ వరకు విస్తరించి ఉంది. జన్కాపూర్, గొడవెల్లి కలుపుకొని 20వార్డులతో మున్సి పాలిటీ, రాజంపేట ప్రాతం అంతా నూతన గ్రామపంచాయతీగా ఏర్పడనుండగా ఆసిఫాబాద్ ముఖచిత్రం మారనుంది.

ఆసిఫాబాద్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా అంజయ్య



కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ అంజయ్య

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 2: రాష్ట్ర ప్రభుత్వం ఆసిఫాబాద్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ గురువారం రాత్రి జీవో విడుదల చేసింది. ఈక్రమంలో ఇన్‌చార్జీ కమిషనర్‌గా కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు బాధ్యతలను అప్పగిస్తూ జీవో జారీ చేసింది. ఈమేరకు శుక్రవారం అంజయ్య ఆసిఫాబాద్ ఇన్‌చార్జీ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ హేమంత్ బోర్కడేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పంచాయతీ అధికారులు పలురికార్డులను అందజేశారు. కార్యక్రమంలో డీపీవో ఉమర్‌హుస్సేన్, ఈవో వంశీకృష్ణ, కాగజ్ నగర్ మున్సిపాలిటీ మేనేజర్ క్రాంతికుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎంపీవో ప్రసాద్ తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కాగజ్‌నగర్ సీఐ

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 2: కాగజ్‌నగర్ పట్టణ సీఐగా శంకరయ్య శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీఐ బుద్ధేస్వామిని రామగుండం కార్యాలయానికి అటాచ్ చేశారు.

ఎస్పీని కలిసిన సీఐ

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 2: కాగజ్‌నగర్‌టౌన్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శంకరయ్య శుక్రవారం ఎస్పీ సురేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయనను అభినందిం చారు.

రేపు సీఐటీయూ సమావేశం

బెజ్జూరు, ఫిబ్రవరి 4: మండలకేంద్రంలోని రైతు వేదికలో ఈనెల4న సీఐటీయూ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆసంఘం నాయకుడు కృష్ణమాచారి తెలిపారు. సమావేశానికి అన్నిరంగాల కార్మికులు హాజరై విజయ వంతం చేయాలని కోరారు.

ఆర్థిక సహాయం అందజేత

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 2: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన తోటి వీడియోగ్రాఫర్‌కు శుక్రవారం ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోషియేషన్ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. కాగజ్‌నగర్ ఓల్డ్ కాలనీకి చెందిన సాయి ఇటీవల బైక్ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో వీడియోగ్రాఫర్లు రూ.22వేల సహాయం అందించి ఆదుకున్నారు.

కాంగ్రెస్‌పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ నాయకుడు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని గుండి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌పార్టీ నాయకుడు పెండె దత్తు శుక్రవారం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈమేరకు డీసీసీ అధ్య క్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ కాంగ్రెస్‌పార్టీ కండువ కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఆయనతోపాటు మరో 30మంది కార్య కర్తలు చేరడంతో వారికి పార్టీకండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చరణ్, చిట్ల నారాయణ, మంగ, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 2: వసతిగృహాల వార్డెన్‌లు, ఆశ్రమపాఠశాలల ప్రధానోపాధ్యా యులు పదవతరగతి పరీక్షలు సమీపిస్తున్నం దున విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాల వార్డెన్‌లు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పదవతరగతి వార్షికపరీక్షలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి18నుంచి 29వరకు జరగనున్న పది పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణతసాధించేలా కృషి చేయాలని తెలిపారు. వసతిగృహాలు, ఆశ్రమపాఠశాలల్లో చదివేవిద్యార్థులపై ప్రత్యేకదృష్టిసారిం చాలన్నారు. వందశాతం ఉత్తీర్ణతసాధించేలా చూడాలన్నారు. సబ్జెక్టులలో వెనకబడ్డ విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. అల్పాహారం, స్నాక్స్ భోజనం సమయానికి అందిస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యం వహించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. వసతి గృహాల సంక్షేమాధికారులు, విద్యార్థులను పాఠశాలలకు సకాలంలో పంపించాలన్నారు. సమావేశంలో గిరిజనసంక్షేమాధికారిణి రమాదేవి, షెడ్యూల్ కులాల సంక్షేమశాఖాధికారి సజీవన్ పాల్గొన్నారు.

రేపు జిల్లాకు హైకోర్టు న్యాయమూర్తి రాక

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 2: జిల్లాకు ఈ నెల 4న హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నంద రానున్నట్లు కలెక్టర్ హేమంత్ బొర్కడే ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో మెగా వైద్యశిబిరం, మెగాన్యాయ అవగాహన శిబిరాలు ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లా అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

కోర్టులో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన జడ్జి

సిర్పూర్(టి), ఫిబ్రవరి 2: మండలకేంద్రంలోని కోర్టు ఆవరణలో వాటర్‌ప్లాంట్‌ను జిల్లా జడ్జి ఎంపీ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని కోర్టుకు వచ్చే ఆయా కక్షిదారులకు వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం కోర్టులో రికార్డులను పరిశీలించి కేసుల విషయంపై సిబ్బం దిని వాకబు చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తి అజయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



సీఎం సభకు తరలి వెళుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 2: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో శుక్రవారం జరిగిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు ఆసిఫా బాద్ మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు భారీసంఖ్యలో తరలివెళ్లారు. డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు ఆధ్వర్యంలో మండలంలోని ఆయాగ్రామాల నుంచి ప్రత్యేకవాహనాలలో సీఎంసభకు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి సభకు హాజరవుతుండగా కాంగ్రెస్‌పార్టీ నాయకులు భారీగా జనాన్ని సమీకరించి బయలుదేరివెళ్లారు. బయలుదేరినవారిలో చరణ్, చిట్ల నారాయణ, గుండ శ్యాం,ఆసిఫ్, వసంత్‌రావు, అసద్, మంగ, మునీర్, కళావతి, రఫీక్, జావిద్ తదితరులు ఉన్నారు.

సిర్పూర్(యు): సీఎంసభకు మండలం నుంచి నాయకులు, పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివెళ్లారు. కుడ్మేత విశ్వనాథ్‌రావు, మండల నాయకులు ఆత్రం గోవింద్‌రావు, ఆత్రం దౌలత్‌రావు తదితరులు ఇంద్రవెల్లి సభకు తరలివెళ్లారు.

జైనూర్: సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు మండల కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సమావేశం అనంతరం తిరిగి వచ్చిన ఆ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి బహిరంగసభకు అంచనాలకంటే మించి ప్రజలు హాజరయ్యా రని పేర్కొన్నారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ద్వార సీఎందృష్టికి తీసుకెళ్లగా సీఎం సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు: డీఎస్పీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న డీఎస్పీ వెంకటరమణ

వాంకిడి, ఫిబ్రవరి 2: పంటపొలాల్లో వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్‌తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటరమణ అన్నారు. శుక్రవారం వాంకిడి మండలం నవేగాం గ్రామ పంచాయతీలో తొక్కిగూడ గ్రామానికిచెందిన రాజక్క కుటుంబానికి పోలీసుస్టేషన్‌లో నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజక్క గత సంవత్సరం వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్‌తీగలకు తగిలి రెండుకాళ్లు కోల్పోయింద న్నారు. ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆమె కుటుంబానికి 30కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందించామన్నారు. రైతులు వారి పంటపొలాలను అడవి పందులు, ఇతరజంతువుల నుంచి రక్షించుకునేందుకు దొంగతనంగా విద్యుత్ తీగలు అమర్చడం వల్ల అవి ప్రమాదాలకు దారి తీస్తున్నాయన్నారు. దానివల్ల కొన్నిసార్లు అమాయకులు చనిపోతున్నారని అన్నారు. ఆయనవెంట సీఐ శ్రీనివాస్, ఎస్సైసాగర్ ఉన్నారు.

మున్సిపల్ కార్మికులుగా గుర్తించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐయూటీ నాయకులు, కార్మికులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 2: ఆసిఫాబాద్ గ్రామ పంచాయతీ మున్సిపల్‌కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ కావడంతో ఇక్కడ పనిచేస్తున్న కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తించాలని, వేజ్‌నం.14 ప్రకారం కేటగిరీవైజ్‌గా వేతనాలు చెల్లించాలని, శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఫిబ్రవరి1 నుంచి మున్సిపాలిటీగా చేస్తూ ప్రభుత్వం జీవో జారీచేయడం వల్ల ఆతేదీనుంచే కార్మికులకు ఉన్న జీవోప్రకారం వేతనాలు కూడా వ్యక్తిగత ఖాతాల్లోనే జమచేయాలని కోరారు. కార్యక్రమంలో రాజేందర్, శ్రీకాంత్, సమ్మయ్య, రమాకాంత్, పురుషోత్తం, ప్రభాకర్, సాగర్, శ్రీను, దుర్గాప్రసాద్, వినోద్ పాల్గొన్నారు.



పదోన్నతులతో వేతనాల పెంపుదల

● రక్షణతో ప్రమాదాలు తగ్గుముఖం

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 2: సింగరేణిలో వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రతిరోజు యాక్టింగ్ నమోదు చేసుకుంటే ఆ ఉద్యోగికి యాక్టింగ్‌ల ప్రాతిపదికన యాజమాన్యం పదోన్నతి అవకాశాన్ని కల్పిస్తున్నదని గని మేనేజర్ శంకరయ్య తెలిపారు. శుక్రవారం ఏరియాలోని కేకే5 గనిలో పనిచేస్తున్న 94 మందికి జనరల్ మజ్దూర్‌తోపాటు 8మందికి ట్రామర్‌లు, ఇద్దరికి కోల్‌కట్టర్‌లు, ముగ్గురికి హాలర్ ఆపరేటర్లు, ఒకరికి మేషన్, మరొకరికి డబ్ రిపేరింగ్ మేస్త్రీ పదోన్నతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సంస్థలో లేని విధంగా సింగరేణిలో మంచి వేతనాలు ఉన్నాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం గనికి నిర్దేశించిన 2లక్షల టన్నుల ఉత్పత్తి కంటే అదనంగా ఉత్పత్తిని సాధించి అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచికార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, గనిరక్షణాధికారి రమేష్, డిప్యూటీమేనేజర్ జశ్వంత్, సంక్షేమాధికారి కార్తీక్, గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, కంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్పత్తి సాధనలో ఆర్కే7 ముందంజ

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 2: ఆర్కే7 గని జనవరి నెలలో 100శాతం బొగ్గుఉత్పత్తి సాధించడం ఆనందంగా ఉందని గ్రూప్ ఏజెంట్ రాముడు అన్నారు. ఉత్పత్తిలో భాగమైన ఎస్‌డిఎల్ ఆపరేటర్ మధు, కోల్ కట్టర్లు మల్లేష్, విజయ్, మహేష్, సత్తయ్య, సపోర్ట్‌మెన్స్ జోగేందర్, ప్రసాద్, రాజమల్లు, షకీల్, టబ్బు రిపేరర్ మహేందర్, ట్రామర్ నాగరాజును న్మానించారు. అందరికృషితోనే ఉత్పత్తి సాధ్యమైందని, రానున్న రెండునెలల్లో ఇదేమాదిరిగా పనిచేసి నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ సాయిప్రసాద్, రక్షణాధికారి రవిశంకర్, సంక్షేమాధికారి సంతన్ పాల్గొన్నారు.

70 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయాలి: సీఎండీ

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 2: దేశ అవసరాల కోసం సింగరేణి సంస్థ ద్వారా 70మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాల్సి ఉందని సీఎండీ ఎన్ బలరాం అన్నారు. శుక్రవారం ఆయన అన్ని ఏరియాల జీఎంలతో సింగరేణిభవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉంటుందని, సింగరేణితో ఒప్పందం ఉన్న అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు రవాణా చేయాల్సిన అవసరం ఉందన్నారు. 70 మిలియన్ టన్నుల బొగ్గుఉత్పత్తి చేయడానికి రెండు నెలల కాలంలో 140 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలన్నారు.

రోజుకు కనీసం 2.3 టన్నులకు తగ్గకుండా బొగ్గును వెలికితీ యాలన్నారు. ఇప్పటివరకు 10నెలల కాలంలో 56.7 మిలియన్ టన్నుల లక్ష్యం కాగా, 56.3మిలియన్ టన్నులు సాధించగలిగామన్నారు. ముఖ్యంగా భూపాలపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏయా లలో ఉత్పత్తి పెంపుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయాఏరియాల జీఎంలను ఆదేశించారు.

సమావేశంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి, ఇందారం, శ్రీరాంపూర్ ఓసీపీల పీవోలు ఎం. శ్రీనివాస్, వి పురుషోత్తమరెడ్డి, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 2: మందమర్రి ఏరియాలోని కేకే5 గనిలో పని చేస్తున్న మైనింగ్ సర్దార్ శివకృష్ణ, బదిలీఫిల్లర్ క్రాంతికిరణ్‌ను శుక్రవారం గని అధికారులు, కార్మికసంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల జయశంకర్ భూపాలపల్లిలో జరిగిన కోల్ ఇండియా హాకీ పోటీల్లో సింగరేణి జట్టు విజేతగా నిలవడంలో ఈ క్రీడాకారులు కీలకపాత్ర పోషించినట్లు గని మేనేజర్ భూశంకరయ్య తెలిపారు. పతకాలు సాధించే క్రీడాకారులను యాజమాన్యం ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో రక్షణాధికారి రమేష్, గుర్తింపు సంఘం నాయకులు గాండ్ల సంపత్, కంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోలేటిలో బ్యూటీషియన్ శిక్షణ తరగతులు ప్రారంభం

రెబ్బెన, ఫిబ్రవరి 2: గోలేటి సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో బ్యూటీషియన్ శిక్షణ తరగతులను శుక్రవారం బెల్లంపల్లి ఏరియా సేవాసమితి ఉపాధ్యక్షురాలు ఎం నళిని నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు వృత్తిశిక్షణ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌వోటూ జీఎం మచ్చగిరి నరేందర్ మాట్లాడుతూ ఉచిత శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు బయ్య మొగిలి, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరైన ఉద్యోగులకు కౌన్సెలింగ్

రెబ్బెన, ఫిబ్రవరి 2: సింగరేణిలో పనిచేస్తున్న గైర్హాజరైన కార్మికులు, ఉద్యోగులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి మాట్లాడుతూ నిత్యం విధులకు హాజరైతే సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ డి ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ ఎం శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

సిర్పూర్(టి), ఫిబ్రవరి 2: మండలంలోని ఫెర్టిలైజర్ దుకాణాల యజమానులు రికార్డులను సక్రమంగా ఉంచాలని ఏవో మధులత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎరువులదుకాణాన్ని ఆమె తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరువుల, మందుల ధరల నోటీసు బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతం కోసం కృషి

జైనూర్, ఫిబ్రవరి 2: బీఆర్‌ఎస్ పార్టీని మండలంలో బలోపేతం చేసేందుకు కృషి చేయాలని మాజీ ఎంపీపీ ఆత్రం భగ్వంత్‌రావ్ అన్నారు. జైనూరు మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీని బోపేతం చేసిన పార్టీ అధ్యక్షుడు తోడ్సం ధర్మారావ్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీచైర్మన్ కనక యాదవ్ రావ్, మండల పార్టీ అధ్యక్షుడు ఇంతీయాజ్‌లాల తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగపరీక్ష కేంద్రాల తనిఖీ

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 2: ఇంటర్ ప్రయోగపరీక్ష కేంద్రాలను శుక్రవారం డీఈఐవో నైతం శంకర్ పరిశీలించారు. పట్టణంలోని పీటీజీ బాలుర పాఠశాల, కళాశాలను ఆయన తనిఖీచేసి పరీక్ష జరుగుతున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రయోగ పరీక్షలకు ఉదయం జనరల్, ఒకేషనల్ విభాగంలో 1033మంది విద్యార్థులు, మధ్యాహ్నం 870మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు డీఈఐవో తెలిపారు.

సర్‌సిల్క్ భూముల ఆక్రమణలపై విచారణ చేయాలి

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 2: కాగజ్‌నగర్ సర్‌సిల్క్ మిల్లు ఎఫ్‌కాలనీలో ఉన్న భూముల కబ్జాలపై కాలనీవాసులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు సర్‌సిల్క్‌లోని స్థలంలో ఆర్‌ఐ రాజేశ్‌కుమార్ విచారణ చేపట్టారు. కబ్జా ఎవరు చేశారనే దానిపై కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. సర్‌సిల్క్ భూముల అన్యాక్రాంతంపై హైదరాబాదులోని మిల్లు లిక్విడేటర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు కాలనీవాసులు తెలిపారు. సర్‌సిల్క్ కబ్జాపై విచారణ చేపట్టి తహసీల్దార్‌కు నివేదించామని ఆర్‌ఐ రాజేష్‌కుమార్ వివరించారు.